క్లుప్తంగా

ప్రారంభోత్సవానికి సిద్ధం



బేతంచెర్లలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

బేతంచెర్ల: మండల కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీలో రూ.80 లక్షలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, గౌరిపేట సమీపాన రూ.29 లక్షలతో నిర్మించిన ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈనెల 12న శనివారం ప్రారంభించనున్నారు. ఓ వైపు డ్రైవర్స్ కాలనీ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రానుండగా, మరో వైపు ఉర్దూ స్కూలు విద్యార్థులకు నూతన భవనం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఆయా భవనాలు పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల క్రితం విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన 21వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో డోన్ శ్రీసుధ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థులు సాత్విరెడ్డి, తన్విరెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరచి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని కరాటే మాస్టర్ రమణ తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం హెచ్ఎం అహ్మద్‌నవాజ్, వైస్ ప్రిన్స్‌పాల్ రంజన్, పెద్దయ్య విద్యార్థులను అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి

ప్యాపిలి: అధికారులు ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఉపాధ్యక్షురాలు రాజా రూపారాణి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమర్పించారు. అనంతరం జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన అందరికీ అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, వైద్యాధికారిణి నుస్రత్ ఉ జొహర తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

బేతంచెర్ల: విద్యార్థుల మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం అని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కల్కి వెంకట సతీష్, రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కబడ్డీ, మ్యూజికల్ చైర్, గన్నీ బ్యాగ్స్, పరుగు పందెం, స్కిప్పింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. అలాగే మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ గంగుల నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. హెచ్ఎం అబ్రహం, లయన్స్ క్లబ్ సభ్యులు మురళీ, వలి బాషా, ధనుంజయ, నాగేంద్ర పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



దస్తావేజులను పరిశీలిస్తున్న జిల్లా సబ్ రిజిస్ట్రార్ చెన్నకేశవ రెడ్డి

బనగానపల్లె: బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా సబ్ రిజిస్ట్రార్ చెన్నకేశవ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారీ జరిగే ఖాళీ స్థలాలు, ఇళ్లు, భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి దస్తావేజులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రోజువారీగా జరిగే రిజిస్ట్రేషన్ వివరాలు బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ శ్రీధర్‌గుప్తా జిల్లా సబ్ రిజిస్ట్రార్‌కు వివరించారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్యాపిలి: దేశ స్వాతంత్య్రం కోసం అసువులు బాసిన వీరుల త్యాగాలు చిరస్మరణీయం అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన నా భూమి–నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. వీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను కొనసాగించడమే మనం వారికి ఇచ్చే గొప్ప నివాళి అని మంత్రి అన్నారు. డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఏపీడీ శ్రీవిద్య, ఏపీఓలు వెంకటరమణ, నర్సిరెడ్డి, పీఆర్ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఈఓఆర్డీ బాలకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుల చికిత్సకు హామీ

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు అరుణ, అనూష కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వీరి తల్లిదండ్రులు శ్రీరాములు, సువర్ణ కొద్ది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శుక్రవారం వారు వెంగళాంపల్లిలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని కలిసి తమ సమస్య చెప్పుకున్నారు. స్పందించిన మంత్రి ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని వారికి హామీ ఇచ్చారు.

పదోన్నతులు కల్పించండి

డోన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లకు పదోన్నతులు కల్పించేందుకు చొరవ చూపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ఏపీ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రఘుబాబు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అసోసియేషన్ నాయకులు మంత్రిని డోన్‌లోని ఆయన స్వగృహంలో కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్ల నుంచి ల్యాబ్ టెక్నీషియన్లకు ఎలాంటి పదోన్నతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ల్యాబ్ సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న తమకు గ్రేడ్–1 ల్యాబ్ టెక్నీషియన్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. తమ సమస్యల పట్ల మంత్రి బుగ్గన సానుకూలంగా స్పందించారని రఘుబాబు తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అనంతపురం, కర్నూలు జిల్లాల అధ్యక్షులు శ్రీధర్‌బాబు, సతీష్‌కుమార్, సంఘం నాయకులు ఉన్నారు.

ఓటరు సర్వే వేగవంతం చేయండి



బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్: నియోజకవర్గంలో ఓటరు వెరిఫికేషన్ సర్వే ఆదివారం సాయంత్రం కల్లా 75 శాతం పూర్తి కావాలని డోన్ ఎలక్ట్రోరల్ అధికారి, ఆర్డీఓ వెంకటరెడ్డి ఆదేశించారు. స్థానిక ఆర్అండ్‌బీ వసతి గృహం సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన బీఎల్ఓలు, సూపర్‌వైజర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల సమగ్ర వివరాలు వెరిఫికేషన్ చేయాలన్నారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారి అభిప్రాయం మేరకు ఓటును ఇక్కడ ఉంచాలా? తొలగించాలా? అనేది నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్ల వయసు నిండిన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. మృతులు, ఈ ప్రాంతం నుండి బదిలీ అయిన వారు, వలస వెళ్లిన వారి వివరాలు సేకరించాలని సూచించారు. పక్కా ఓటరు జాబితా రూపొందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలన్నారు. వెరిఫికేషన్ విధులకు హాజరుకాని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ కోతలు

డోన్ టౌన్: నుసుసురాళ్ల 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా యు.కొత్తపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్, పట్టణంలోని డిగ్రీ కళాశాల పరిసరాలతో పాటు ఉంగరానిగుండ్ల, దొరపల్లె గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నాగేశ్వర రెడ్డి తెలిపారు. వ్యవసాయానికి ఇచ్చే కరెంటు ఉదయం 5 గంటల నుంచి సరఫరా చేస్తామన్నారు.

యాగంటిలో రూ.1.40 కోట్లతో సీసీ రోడ్డు



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఆలయ చైర్మన్, ఈఓలు

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం రూ.1.40 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ తోట బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పర్యాటకులు, భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో డీఎంఎఫ్ కింద రూ.కోటి నిధులతో పాటు దేవదాయ శాఖకు చెందిన మరో రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఆలయ పరిధిలోని హోటళ్ల నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు ఈ సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేస్తామన్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్ట్

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంజలపాడు రహదారిలో నాటుసారా విక్రేతలను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మౌలానీ తెలిపారు. ఎస్ఐ అందించిన సమాచారం మేరకు.. ఉయ్యాలవాడ మండలం సర్వాయిపల్లెకు చెందిన మహేశ్వరరెడ్డి, ఆనందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, పాణ్యం మండలం తమ్మరాజుపల్లెకు చెందిన సుబ్బయ్య, శివకుమార్ అనే వ్యక్తులు నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించి సారా విక్రేతలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 25 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ముమ్మరంగా ప్రచారం



అభ్యర్థికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలలో ఖాళీగా ఉన్న ఒక్కో వార్డు స్థానానికి ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. దీంతో ఆయా గ్రామాల్లో శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచార పర్వం ఊపందుకుంది. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 6వ వార్డు స్థానానికి 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి కాల్వశ్రీవాణి ఎన్నికల ప్రచారంలో ముందుంది. అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస నాయక్, దశరథరామిరెడ్డి, కాల్వనాగేశ్వరరావు, గువ్వల రామకృష్ణారెడ్డి తదితరులు వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కనుగాలి తిమ్మారెడ్డి (65) గుండెపోటుతో శుక్రవారం మరణించాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, ఎంపీటీసీ నాగేషు, మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ సత్యం రెడ్డి తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

డోన్ టౌన్: పట్టణ సమీపంలో జాతీయ రహదారిపై మంజీరా బార్ అండ్ రెస్టారెంట్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. భర్త గిరి (26) కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందగా భార్య గీత అపస్మారక స్థితికి (కోమాలోకి) వెళ్లినట్లు బంధువులు తెలిపారు.

ప్రారంభమైన కౌన్సెలింగ్

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ ఇంజినీరింగ్ కోర్సులలో చేరేందుకు కౌన్సిలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభం అయ్యింది. ఈ నెల 14వ తేదీ వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని కళాశాల ఓఎస్డీ ఎంపీ రాజేష్ తెలిపారు. 16వ తేదీన మాడిఫికేషన్ చేసుకోవడానికి అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. 18వ తేదీన విద్యార్థులకు సీట్లను కేటాయిస్తారని, 23 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

డోన్ టౌన్: విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలని ప్రభుత్వ ఆసుపత్రి హోమియో వైద్యురాలు డాక్టర్ మాధవి అన్నారు. పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల్లో శుక్రవారం సీజనల్ వ్యాధుల నివారణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి హోమియోపతి మందులను పంపిణీ చేశారు. పాఠశాల్లో కండ్లకలక అధికంగా ఉండటంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ గీత, వైద్య సిబ్బంది పుష్పావతి, రుక్మిణమ్మతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్పీల మధ్య ఘర్షణ

డోన్ టౌన్: మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో ఆర్పీలుగా పని చేసే కళ్యాణి, మహేశ్వరి మధ్య లోన్ మంజూరు విషయంపై వాగ్వాదం ఏర్పడి ఒక్కరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చిరు వ్యాపారులకు మంజూరు చేసే చేదోడు రుణం విషయంలో.. తన గ్రూపునకు చెందిన మహిళకు నువ్వు ఏలా మంజూరు చేయిస్తావు అని కళ్యాణి శుక్రవారం మహేశ్వరిని నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఇరువురు దాడి చేసుకున్నారు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించిన పట్టణ పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగిఉండాలి



గోరుమానుకొండ మోడల్ స్కూల్లో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

బేతంచెర్ల: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ప్రతిఒక్కరు స్మరించుకోవాలని ఎంపీడీఓ వెంగన్న, గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గోరుమానుకొండ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ గంగుల నాగరాజు, ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో నా భూమి– నా దేశం కార్యక్రమంలో భాగంగా శిలాఫలకం ఏర్పాటు చేశారు. నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం అనంతరం మొక్కలు నాటారు. ఎంపీటీసీ రామనాథం, సూపరింటెండెంట్ దస్తగిరి బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సంజామల: ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగిఉండాలని ఎంపీడీఓ నాగకుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఆకుమల్ల, నొస్సం, అక్కంపల్లి, లింగందిన్నె, వసంతాపురం గ్రామాలలో నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు శిలాఫలకం ఏర్పాటు చేశారు. నేల తల్లికి నమస్కారం, వీరులకి వందనం ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఓ ప్రకాష్‌రావు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

బనగానపల్లెరూరల్: మండలంలో 5 నుంచి 18 ఏళ్ల లోపు వయసున్న పిల్లలందరినీ తప్పనిసరిగా బడి లేదా కళాశాలలో చేర్పించాలని ఎంపీడీఓ శివరామయ్య, ఎంఈఓ స్వరూప సూచించారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో సీఆర్‌టీలు, సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో బడి బయట పిల్లలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్‌టీలు, గ్రామ సచివాలయల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్ల ద్వారా వారికి కేటాయించిన కుటుంబాల్లో 5–18 ఏళ్లలోపు బాలబాలికల వివరాలను సేకరించి, బడి లేదా కళాశాలలో వారు చదువు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 1,904 మంది వివరాలు అందాల్సిఉందన్నారు. వారి వివరాలను త్వరగా అందజేసి ఆన్‌లైన్‌లో పొందు పరచాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదని హెచ్చరించారు.

పంట నమోదు పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి

డోన్ టౌన్: ఖరీఫ్–23లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రం సహాయకులు పొలాల వద్దకు వెళ్లి పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయశాఖ ఏడీ అశోక్‌వర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చంద్రన్న సూచించారు. స్థానిక ఏడీ కార్యాలయంలో శుక్రవారం పంటల నమోదు కార్యక్రమం, పంట కోత ప్రయోగాలపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పంటల సాగులో సూచనలు, సలహాలు అందించాలన్నారు. ఆర్బీకేల్లోని ఎరువుల నాణ్యతపై రైతులకు వివరించాలన్నారు. సహాయ గణాంక అధికారి మునిస్వామి, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫి ఉన్నారు.

11 నామినేషన్లు ఆమోదం

బేతంచెర్ల: మండలంలోని ఎం.పేండేకల్లు, రహిమానుపురం, అంబాపురం గ్రామ పంచాయతీల్లో ఒక్కొక్క వార్డు చొప్పున జరుగుతున్న ఉప ఎన్నికలకు సంబంధించి స్క్రూటినీ అనంతరం 11 నామినేషన్లు ఆమోదం పొందినట్లు ఆర్వోలు సోమశేఖర్, కిరణ్‌కుమార్, వెంకట రంగనాయక్ తెలిపారు. వివిధ కారాణాలచేత ఖాళీగా ఉన్న ఆయా వార్డులకు ఈనెల 19న ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా నామినేషన్ల ప్రక్రి య, పరిశీలన ప్రశాంతంగా ముగిసింది. ఈనెల 14వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ నాటికి ఎంత మంది బరిలో ఉంటారనేది వేచి చూడాల్సిందే.

'వరి'లో కాలిబాటలతో ప్రయోజనం



కాలిబాట వదులుతూ వరి నాట్లు వేస్తున్న కూలీలు

బనగానపల్లె రూరల్: వరి పంటలో కుదుళ్లను దగ్గరగా నాటడం వల్ల పంటకు తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉందని, తెగుళ్ల నివారణకు వరి నారు నాటే సమయంలోనే కాలిబాటలు వేసుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. వరి నాట్లలో కాలిబాటలను ఏర్పాటు చేసుకోవడం వల్ల రైతులకు కలిగే బహుళ ప్రయోజనాలను ఆయన వివరించారు.వరిలో కాలిబాట వేసుకోవడం వల్ల గాలి సూర్యరశ్మి సక్రమంగా అందడంతో పంట ఏపుగా పెరుగుతుందని చెప్పారు.

గొచ్చులుగా నాటొద్దు

వరి కుదుళ్లను గొచ్చులుగా నాటడం వల్ల పంటకు గాలి వెలుతురు సక్రమంగా అందక పైరు పెరుగుదల మందగించడంతో పాటు చీడపీడలు తొందరగా ఆశిస్తాయి. సాధారణంగా ఎక్కువ వరి మొనలను నాటితే ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులు భావిస్తుంటారని, అది సరైన పద్ధతి కాదన్నారు. వరి మొనలలో సాంద్రతే కీలకం. దగ్గరగా నాటడం వల్ల మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్లు ఎక్కువగా సోకే అవకాశం ఉంటుందని తెలిపారు

కాలిబాటలతో ఉపయోగాలు

- వరిలో తెగుళ్ల సమవర్ధవంతంగా తట్టుకునేందుకు ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ వెడల్పుతో కాలిబాటలను వేసుకోవాలి. కాలిబాట ద్వారా మొక్కల సామర్థ్యం పెరుగుతుంది.
- పంటకు గాలి, సూర్యరశ్మి వెలుతురు పుష్కలంగా లభిస్తుంది.
- అగ్గి తెగులు, సుడిదోమ వ్యాప్తిని అదుపు చేయవచ్చు
- ఎరువులను కాలిబాటల ద్వారా చల్లితే పొలమంతా సమానంగా వేసేందుకు అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతుంది.
- కిరణజన్య సంయోగక్రియ అధికంగా జరిగి మొక్కలలో పత్రహరితం అధికంగా ఉత్పత్తి కావడంతో పంటల దిగుబడులు పెరిగేందుకు అవకాశం ఉంటుంది.
- ఎలుకలను సమర్ధవంతంగా అదుపు చేయవచ్చు. కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టడానికి అనుకూలంగా ఉంటుంది.



వరిమడిలో వదిలిన కాలిబాట

అధికారుల సూచనలు పాటించాలి



ఖరీఫ్‌లో వరి నాట్లు వేసే రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలి. పొలంలో కాలిబాటలు ఉండేవిధంగా నారు నాటుకోవడం వల్ల అదనపు ప్రయోజనలు ఉన్నాయి. పంటలో పడిన కలుపు మొక్కలు తీసేందుకు ఎరువులను అందించేందుకు సులువుగా ఉండడంతో పాటు మరిన్ని ఉపయోగాలు ఉన్నాయి.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె మండలం

నేడు శిలాఫలకం ఆవిష్కరణ

బేతంచెర్ల: మండలపరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి సంబంధించి ఆర్ఎస్ రంగాపురం గ్రామ సమీపంలో ఆలయ ముఖద్వార శిలాఫలకం నిర్మాణ పూజ కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. రూ.2.75 కోట్లతో రాతి కట్టడంతో నిర్మించే ఆలయ ముఖ ద్వార శిలాఫలకంను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరిస్తారన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం



రేపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేకపోవడంతో చిన్నారులను చూసుకుంటున్న ఆయా వరలక్ష్మి

బేతంచెర్ల: మండల పరిధి రేపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త సమయపాలన పాటించకపోవడంతో పాటు గర్భిణులు, చిన్నారులకు గ్రుడ్లు, పాలు, ఇతర పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయడం లేదని గ్రామస్తులు వాపోయారు. శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బలక్ష్మమ్మ ఉదయం 9 గంటలకు రావాల్సి ఉండగా 11 గంటలకు వచ్చింది. అంతవరకు ఆయా వరలక్ష్మి వంట మొదలుకొని, పిల్లలకు అన్నీ తానై చూసుకుంది. అంగన్‌వాడీ కార్యకర్త సమయపాలన పాటించేలా ఐసీడీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి



కోవెలకుంట్ల సమీపంలో మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నిరంజన్

కోవెలకుంట్ల: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట స్థానంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వరి స్థానంలో ఆరుతడి పంటలైన మినుము, జొన్న, మొక్కజొన్న, పెసర, తదితర పంటలు సాగు చేయాలన్నారు. ఆయా సీజన్లలో సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. పంటల నమోదు ఆధారంగానే పంట నష్ట పరిహారం, పంట ఉత్పత్తుల కొనుగోలు, పంటల బీమా, తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. సలహా మండలి చైర్మన్ రామసుబ్బారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ సెలవు



పదవీ కాలానికి సెలవు పత్రాన్ని ఎంపీడీఓకు అందజేస్తున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా శుక్రవారం నుంచి కొన్ని నెలల పాటు పదవీ కాలానికి సెలవు పెట్టారు. ఈ మేరకు మెడికల్ సర్టిఫికెట్‌తో కూడిన సెలవు పత్రాన్ని ఎంపీడీఓ రాధికకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సర్పంచ్ సెలవు పత్రాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి తర్వాతి కార్యచరణ రూపొందిస్తామని వెల్లడించారు.

పాఠశాలలో కుంగిన భూమి



అవుకు బాలికల పాఠశాల ఆవరణలో కుంగిన భూమి

అవుకు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సొరంగం ఏర్పడిందంటూ శుక్రవారం కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. ఉదయాన్నే సిబ్బంది పాఠశాల, ఆవరణాన్ని శుభ్రం చేస్తుండగా బోర్‌వెల్ వద్ద సొరంగం ఏర్పడినట్టు కనిపించింది. భయాందోళనకు గురైన సిబ్బంది వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని విద్యార్థులు ఆ సొరంగం వైపుకు వెళ్లకుండా చుట్టూ రిబ్బన్ కట్టి, ముళ్లకంపను ఉంచి జాగ్రత్తలు తీసుకున్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి మాట్లాడుతూ.. పాఠశాలలో ఇటీవల బోర్‌వెల్ వేయించినట్లు చెప్పారు. ఆ సమయంలో కేసింగ్ సరిగా వేయకపోవడంతో వర్షపు నీరు నిలిచి మట్టి కుంగడంతో గొయ్యిలా ఏర్పడిందన్నారు. గొయ్యి బోర్‌వెల్ కింద వెళ్లడంతో సొరంగంలా కనిపిస్తోందని చెప్పారు. అధికారులకు విషయాన్ని తెలియజేశామని, కాంక్రీట్‌తో ఆ గొయ్యిని పూడ్చేస్తామని తెలిపారు.

మృతికి నివాళి



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథి రెడ్డి

అవుకు: మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన కంకర రామలక్ష్మమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథి రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మారం భాస్కర్ రెడ్డి ఉన్నారు.